https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్

ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 103 శనివారం 22-08-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం

Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో

నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?

అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...

మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు

9989788438, 9505485656.

# అమెరికాకు నో!

## రేవంత్ పర్యటనకు పొలిటికల్ క్లియరెన్స్ ఇవ్వని కేంద్రం

- కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై సీఎం రేవంత్ విస్మయం
- కేంద్రం నిర్ణయాన్ని గౌరవిస్తూ పర్యటన రద్దు
- 23న అమెరికాకు బదులు హైదరాబాద్‌కు రేవంత్
- వర్సిటీలతో ఒప్పందాల బాధ్యత అధికారులకు
- అమెరికాలో కార్యక్రమాలు సీఎం స్థాయికి తగవు
- అందుకే రాజకీయ అనుమతికి నిరాకరించాం
- విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి వివరణ
- బ్రిటన్, అమెరికా పర్యటనల ఉద్దేశం ఒకటే అయినా అనుమతి నిరాకరణపై ప్రభుత్వ వర్గాల్లో విస్మయం



**హైదరాబాద్, ఆగస్టు 21**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన రద్దయింది. ఆయన బ్రిటన్ పర్యటనకు అనుమతులు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం అమెరికా పర్యటనకు మాత్రం ఇవ్వడానికి నిరాకరించింది. దీంతో ప్రస్తుతం లండన్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని గౌరవిస్తూ తన అమెరికా పర్యటనను రద్దు చేసుకున్నారు. వాస్తవానికి ఈ నెల 21 నుంచి 29 వరకు రేవంత్‌రెడ్డి బ్రిటన్, అమెరికా దేశాల్లో అంతర్జాతీయ వర్సిటీలతో ఒప్పందాల కోసం పర్యటన పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయా దేశాల్లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనకు అనుమతులు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి కార్యాలయం ప్రతిపాదనలు పంపింది. తొలుత రేవంత్‌రెడ్డి బ్రిటన్ పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. సాధారణంగా రాష్ట్రాల ముఖ్యమంత్రుల పర్యటనలకు కేంద్ర ప్రభుత్వం తేలికగానే అనుమతులు మంజూరు చేస్తూ ఉంటుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఇదే భావనతో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం రాత్రి లండన్ పర్యటనకు బయలుదేరి వెళ్లి పోయారు. ఇంతలో కేంద్ర ప్రభుత్వం అమెరికా పర్యటనకు పొలిటికల్ క్లియరెన్స్‌ను నిరాకరించింది. బ్రిటన్ పర్యటనకు అనుమతినిచ్చి అమెరికా పర్యటనకు నిరాకరించడంపై ముఖ్యమంత్రి విస్మయం వ్యక్తం చేశారు. ఈ నెల 23న లండన్ నుంచి బోస్టన్‌కు వెళ్లాల్సిన ముఖ్యమంత్రి తాజా పరిస్థితుల నేపథ్యంలో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కానున్నారు. సీఎం అమెరికా పర్యటనకు అనుమతిని నిరాకరించడం పైన కేంద్ర విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ శుక్రవారం ఢిల్లీలో వివరణ ఇచ్చారు. రేవంత్ బ్రిటన్ పర్యటనకు అనుమతిని ఇచ్చామని వెల్లడించిన ఆయన.. అమెరికా పర్యటనకు మాత్రం అనుమతి నిరాకరించినట్లు చెప్పారు. "ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖుల విదేశీ పర్యటనలకు పొలిటికల్ క్లియరెన్స్ ఇచ్చే ముందు కేంద్ర విదేశాంగ శాఖ ఆయా పర్యటనలను పరిశీలిస్తుంది. ప్రతిపాదిత కార్యక్రమాలు వారు నిర్వహిస్తున్న పదవికి, పర్యటన ఉద్దేశానికి తగిన విధంగా ఉండాలి. అమెరికా పర్యటన కార్యక్రమం ఆ ప్రమాణాలకు అనుగుణంగా లేదని భావించాం. అందుకే పొలిటికల్ క్లియరెన్స్ నిరాకరించాం" అని వివరించారు. విధి విధానాలు, ప్రొటోకాల్ ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి యూకే, అమెరికా పర్యటనలకు అనుమతిని ఇవ్వాల్సిందిగా తెలంగాణ సీఎంఓ కేంద్ర ప్రభుత్వాన్ని ముందే కోరింది. కేంద్ర ప్రభుత్వం తొలుత యూకే పర్యటనకు అనుమతిని ఇచ్చింది. ముఖ్య మంత్రుల విదేశీ పర్యటనలకు సర్వ సాధారణంగా అనుమతులు వచ్చే ఆనవాయితీ ఉండటం, అప్పటికే లండన్ పర్యటనకు కేంద్రం అనుమతులు ఇచ్చేయడంతో షెడ్యూల్‌ను ప్రకటించేసి తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందంతో సీఎం లండన్‌కు వెళ్లి పోయారు. బృందం యూకేకు చేరుకున్న తర్వాత అమెరికా పర్యటనకు అనుమతి ఇవ్వడం లేదని కేంద్రం తెలియజేసింది.

105 ఏళ్ల వృద్ధుడికి సుప్రీంకోర్టులో

# భారీ ఊరట..

## జీవిత ఖైదు రద్దు..



**హైదరాబాద్, ఆగస్టు 21**

హత్యకేసులో జీవిత ఖైదు శిక్ష పడిన 105 ఏళ్ల వృద్ధుడికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. మిగిలిన శిక్షా కాలాన్ని రద్దు చేస్తూ శుక్రవారం సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించింది. ఆ వివరాల్లోకి వెళితే.. పశ్చిమ బెంగాల్‌లోని మల్ద జిల్లాకు చెందిన రసిక్ చంద్ర మొండల్ 1920లో జన్మించారు. 1988లో మర్డర్ కేసులో ఆయన జైలు పాలయ్యారు. 1994లో కోర్టు అతడిని దోషిగా తేల్చి జీవిత ఖైదు విధించింది. తనకు పడ్డ శిక్షను సవాల్ చేస్తూ మొండల్ 2018లో కోల్‌కతా హైకోర్టులో పిటిషన్ వేశారు. హైకోర్టు ఆయన పిటిషన్‌ను కొట్టేసింది. తర్వాత అపెక్స్ కోర్టుకు వెళ్లగా.. అక్కడ కూడా మొండల్‌కు నిరాశే ఎదురైంది. దీంతో మొండల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వయసును దృష్టిలో ఉంచుకుని శిక్షా కాలం ముగియటానికంటే ముందే తనను రిలీజ్ చేయాలంటూ ఆయన పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు 2024 నవంబర్ 29వ తేదీన మొండల్‌కు మధ్యంతర బెయిల్ మంజూర్ చేసింది. శుక్రవారం మరోసారి సుప్రీంకోర్టులో మొండల్ పిటిషన్‌పై విచారణ జరిగింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వీ మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం పిటిషన్‌పై విచారణ జరిపింది. పిటిషనర్ వయసును దృష్టిలో ఉంచుకుని కేసును ముగిస్తున్నట్లు ధర్మాసనం స్పష్టం చేసింది. మిగిలిన శిక్షాకాలాన్ని కూడా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. సుప్రీంకోర్టు తీర్పుతో 105 ఏళ్ల వయసులో రసిక్ చంద్ర మొండల్ జీవిత ఖైదు నుంచి విముక్తి పొందారు.

సర్కారు బడి తనిఖీకి వెళ్లిన

# సీజేపీ బృందంపై దాడి

- రాజస్థాన్‌లోని రాంపురా కన్వార్‌పురాలో ఘటన
- రాళ్లు, కర్రలతో విరుచుకుపడ్డ స్థానికులు
- వాహనాలు ధ్వంసం.. పలువురికి గాయాలు
- ఇది బీజేపీ గుండాల పనే: దీప్కే



**జైపూర్, ఆగస్టు 21:**

రాజస్థాన్‌లోని జైపూర్‌లో సర్కార్ బడి తనిఖీ చేయడానికి వెళ్లిన కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) బృందంపై శుక్రవారం తీవ్రస్థాయిలో దాడి జరిగింది. 'స్కూల్ ఠీక్ కరో' కార్యక్రమంలో భాగంగా సీజేపీ కో-కన్వీనర్ అశుతోష్ రంకా నేతృత్వంలోని ప్రతినిధుల బృందం.. రాంపురా కన్వార్‌పురా గ్రామంలో బడుల స్థితిగతులను పరిశీలించేందుకు వెళ్లింది. సీజేపీ ప్రతినిధులు గ్రామానికి చేరుకోగానే.. స్థానికులు, బీజేపీ కార్యకర్తలు చుట్టుముట్టి రాళ్లతో, కర్రలతో విరుచుకు పడ్డారని అశుతోష్ ఆరోపించారు. పాఠశాల భవనం ప్రమాదకరంగా ఉందనే కారణంతో, గత కొన్నేళ్లుగా విద్యార్థులకు సమీపంలోని ఓ పశువుల కొట్టంలో తరగతులు నిర్వహిస్తున్నారని.. దీనిని ప్రశ్నించినందుకు తమపై దాడి చేయించారని ధ్వజమెత్తారు. తమ సభ్యులపై దాడి చేసి చొక్కాలు చింపేశారని, వాహనాల అద్దాలు, మొబైల్ ఫోన్లు ధ్వంసం చేశారని.. మహిళా ప్రతినిధులపై బురద చల్లి దుర్భాషలాడారని వాపోయారు. ఈ ఘర్షణల్లో పలువురు సభ్యులకు తీవ్ర గాయాలయ్యాయని, ఒకరి చెయ్యి కూడా విరిగిందని పేర్కొన్నారు. రాజస్థాన్ విద్యాశాఖమంత్రి మదన్ దిలావర్ ఆదేశాల మేరకే.. బీజేపీ గుండాలు తమపై దాడి చేశారని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఆగ్రహం వ్యక్తం చేశారు. పశువుల పాకలో నడుస్తున్న బడిని బాగుచేయాలని కోరడమే తమ ప్రతినిధులు చేసిన నేరమా? అని నిలదీశారు. బాధ్యులైన వారిని 48గంటల్లో అరెస్ట్ చేయాలని లేదంటే తమ నిరసనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

వివేకా హత్య కేసులో..

# రంగంలోకి ఈడీ!

## ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి నివాసాల్లో తనిఖీలు

- శివశంకర్‌రెడ్డి, గంగిరెడ్డి, సునీల్, దస్తగిరి ఇళ్లలో కూడా..
- పులివెందుల, హైదరాబాద్ సహా ఏడు చోట్ల ఏకకాలంలో సోదాలు
- అవినాశ్ ఇంట్లో 24 లక్షల నగదు స్వాధీనం
- హత్య క్రమంలో చేతులు మారిన డబ్బుపై ఆరా
- మనీ ట్రయల్ కోణంలో తొలి అడుగు




**కడప/హైదరాబాద్, ఆగస్టు 21**

మాజీ సీఎం జగన్ చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తొలిసారి రంగప్రవేశం చేసింది. శుక్రవారం ఏకకాలంలో హైదరాబాద్‌లోను, కడప జిల్లాలోనూ ఏడు చోట్ల ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ఇళ్లతో పాటు వివేకా హత్య కేసు నిందితులైన దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, సునీల్ యాదవ్, దస్తగిరి, ఎర్ర గంగిరెడ్డి ఇళ్లలోనూ సోదాలు నిర్వహించింది. అవినాశ్‌రెడ్డి ఇంట్లో రూ.24 లక్షల నగదు, రెండు లాకర్ల తాళాలను, కొన్ని కీలక పత్రాలను, డిజిటల్, ఎలక్ష?ట్రనిక్ ఆధారాలను కూడా స్వాధీనం చేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన ఈడీ అధికారులు సుమారు 40 మంది ఏకకాలంలో పులివెందుల బాకరాపురంలోని ఎంపీ అవినాశ్‌రెడ్డి, జయమ్మ కాలనీలోని దస్తగిరి, మైత్రి లేఅవుట్‌లో ఉంటున్న సునీల్ యాదవ్, సుజాత థియేటర్ వెనుక ఉంటున్న దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, తొండూరు మండలం టి.తుమ్మలపల్లె లోని ఎర్ర గంగిరెడ్డి ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. అయితే ఆ సమయంలో అవినాశ్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, ఎర్రగంగిరెడ్డి ఇళ్లలో లేరు. ఎంపీ ఇంటికి తాళం వేసి ఉంది. ఆయన చిన్నాన్న మనోహర్‌రెడ్డి వచ్చి తాళం తీయడంతో అధికారులు లోపలకు వెళ్లారు. దాదాపు ఆరున్నర గంటలు తనిఖీలు చేశారు. హైదరాబాద్‌లోని కోకాపేటలో అవినాశ్‌రెడ్డి నివాసంలోనూ 8 గంటలు సోదాలు నిర్వహించారు. బ్యాంకు ఖాతాలు, ఆర్థిక లావాదేవీలు, ఆస్తులకు సంబంధించిన పత్రాలు, ఇతర ఆర్థిక రికార్డులను పరిశీలించి కొన్ని కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే హైదరాబాద్‌లోని మైహోమ్ అవతార్‌లో శివశంకర్‌రెడ్డి నివాసంలోనూ సోదాలు జరిపి కొన్ని డిజిటల్ ఆధారాలు సేకరించినట్లు ఈడీ అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. దస్తగిరి ఇంట్లో కూడా దాదాపు 7 గంటల పాటు విచారణ చేపట్టి పలు వివరాలను రాబట్టడమే గాక 1400 పేజీల డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. తన తండ్రి హత్య కేసులో దర్యాప్తు సక్రమంగా సాగడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తూ వివేకా కుమార్తె సునీతారెడ్డి ఈనెల 8వ తేదీన భారత రాష్ట్రపతికి లేఖ రాసిన సంగతి తెలిసిందే. హత్య జరిగి ఏడేళ్లు గడుస్తున్నా కొన్ని కీలక అంశాల చిక్కుముడి వీడలేదని, హత్యకు ఉపయోగించిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకోలేదని, డబ్బు మూలాలు, మనీ ట్రయల్, హత్య వెనుక ఉన్న విస్తృత కుట్ర, కీలక వ్యక్తుల కదలికలపై దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందని ఆమె అందులో తెలిపారు. కేసులో కోట్లాది రూపాయల ఆర్థిక లావాదేవీల కోణాన్ని లోతుగా పరిశీలించాలని ఆమె అభ్యర్థించిన నేప?థ్యంలో ఈడీ దర్యాప్తును ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. హత్యకు డబ్బు ఎవరు సమకూర్చారు? ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరెవరికి చెల్లించారు? నగదు బదిలీ బ్యాంకు ఖాతాల ద్వారా జరిగిందా? హవాలా మార్గాలను వాడారా? దీని వెనుక ఎవరున్నారనే అంశాలపై ఈడీ దృష్టి సారించడం రాజకీయ వర్గాల్లో కలకలం సృష్టిస్తోంది.

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి

# ప్రభుత్వం సానుకూలం: మంత్రి సీతక్క



**హైదరాబాద్, ఆగస్టు21:**

ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం సానుకూలంగా ఉందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఫీల్డ్ అసిస్టెంట్ ప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. చాలా ఏళ్లుగా వారి సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. గత ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్‌లను విధుల నుంచి తప్పించిందని మండిపడ్డారు. వారిని తిరిగి ఫీల్డ్ అసిస్టెంట్లుగా తమ ప్రభుత్వం విధుల్లోకి తీసుకుందని గుర్తు చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ల మధ్య వేతనంలో వ్యత్యాసం ఉందని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ సైజు, పనుల కల్పనకు ముడి పెట్టకుండా ఫీల్డ్ అసిస్టెంట్‌లందరికీ ఒకే విధంగా వేతనం ఉండేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు. అలాగే ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని భరోసా కల్పించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు.. తమను ఎఫ్‌టీఈలుగా గా కన్వర్ట్ చేయాలని కోరుతున్నారని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలతో చర్చించి.. త్వరలో తమ నిర్ణయాన్ని ప్రకటిస్తామని వెల్లడించారు.

# సురేఖపై వేటు!



- మంత్రివర్గం నుంచి తప్పించే యోచనలో అధిష్ఠానం
- సీఎం రేవంత్‌రెడ్డిపై కొండా సుస్మిత వ్యాఖ్యలతో సీరియస్

**హైదరాబాద్, ఆగస్టు 21:**

సీఎం రేవంత్‌రెడ్డిపై మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మితా పటేల్ పదే పదే విమర్శలు చేస్తుండడంపై అధిష్ఠానం ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వంలో బాధ్యత గల మంత్రి అయివుండీ.. తన కుమార్తె వివాదాస్పద వ్యాఖ్యలు చేయకుండా కొండా సురేఖ అదుపు చేయకపోవడంపై హైకమాండ్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. స్వయంగా సురేఖ సైతం గతంలో సినీ నటులపై, సొంత పార్టీ నాయకులపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు లెక్కల్లోకి వస్తున్నాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఆమెను మంత్రివర్గం నుంచి తప్పించే ఆలోచనలో అధిష్ఠానం ఉందని, తద్వారా సీఎం రేవంత్‌రెడ్డిపై, ప్రభుత్వంపై, కాంగ్రెస్ పార్టీపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడే నాయకులకు గట్టి సంకేతం ఇవ్వాలనుకుంటోందని ఏఐసీసీ వర్గాలు అంటున్నాయి. అయితే కొండా సురేఖను క్యాబినెట్ నుంచి తొలగిస్తూ నిర్ణయం తీసుకోవాలా? లేక మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఆమెను తప్పించాలా? అన్నదానిపై తర్జన భర్జన పడుతున్నట్లు ఆ వర్గాలు పేర్కొంటున్నాయి.

# కూలిన న్యాయం..

మణిపూర్ ఘోరకలిలో సామూహిక అత్యాచారానికి గురైన ఒక యువతి ఇటీవల మరణించింది. కుకీ తెగకు చెందిన ఈమెను 2023 మే 15న మీతీ తెగకు చెందిన నలుగురు యువకులు జీపులో అపహరించుకుపోయి బిష్ణుపూర్ కొండల్లో సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ తరువాత ఆమెను తమ తెగకు చెందిన అరంబాయ్ తెంగోల్ అనే మిలిటెంట్ గ్రూప్?కు అప్పగించారు. వారు ఆ రాత్రంతా ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డారు. తెల్లవారిన తరువాత బాత్‌రూమ్‌కు వెళ్ళడానికి వారిలో ఒకడు ఆమె కట్లు విప్పడంతో ఎలాగో తప్పించుకొని కూరగాయల ఆటోలో దాక్కొని వెనక్కు రాగలిగింది. సమస్త వ్యవస్థలు మీతీల ఆధిపత్యంలో ఉంటూ, శాంతిభద్రతలు అత్యంత క్షీణదశలో ఉన్న కారణంగా ఆమె ఎటూ కదల్లేకపోయింది. రహస్యంగా కుకీల ఆశ్రయంలో ఉంటూ, నాగాలాండ్‌లోని ఒక ఆస్పత్రిలో కొంతకాలం చికిత్స తీసుకున్న తరువాత ఆమె స్వరాష్ట్రంలో తనపై జరిగిన ఘోరంపై జూలై 21న కొంతమంది సాయంతో ఫిర్యాదు చేసింది. నిందితులకోసం తీవ్రంగా గాలిస్తున్నామని, ఇంకా ఎవరినీ అరెస్టు చేయలేదని నెలరోజుల తరువాత ప్రకటించిన పోలీసులు ఇప్పటికీ అదేమాటమీద నిలబడ్డారు. భౌతికంగానూ, మానసికంగానూ కుంగిపోయిన ఆమె తనకు న్యాయం చేకూర్చని ఈ లోకం నుంచి నిష్క్రమించింది. ఈ మూడేళ్ళలో ఇరుగుపొరుగు రాష్ట్రాలతో సహా వివిధ ఆస్పత్రుల్లో ఆమెకు చికిత్స చేయించినా ప్రయోజనం లేకపోయింది. గాయాల ప్రభావంతో, తీవ్ర మనోవేదనతో ఆమె జీవచ్ఛవంలాగా మారిపోయింది. తరచుగా స్పృహ



తప్పి పడిపోయేదని, కన్నుమూసే ఆఖరుక్షణంవరకూ ఆ ఘోరాన్ని మరిచిపోలేదని, అవమాన భారంతో పాటు, నిందితుల్లో ఒక్కరినీ ఇప్పటి వరకూ అరెస్టుచేయకపోవడం ఆమెను మరింత కుంగదీసిందని తల్లి బాధపడుతోంది. చలాకీగా, నవ్వుతూ గలగలామాట్లాడే తన కుమార్తె తనతో తప్ప మిగతావారితో మాట్లాడటం మానేసిందని, ఒంటరిగా గదిలో ఉంటూ వొణికిపోయేదని ఆ తల్లి ఆవేదన చెందింది. మణిపూర్?లో మే తొలివారంలో మంటలు రేగి, అనతికాలంలోనే ఉధృతంగా సాగిన నేరాలూ ఘోరాలమీద ఎవరూ నోరువిప్పని, ఏ వ్యవస్థలూ అడ్డుపడని వాతావరణం ఎంతోకాలం యథేచ్ఛగా కొనసాగింది. ఇద్దరు కుకీ యువతులను మీతీ తెగకు చెందినవారు నగ్నంగా ఊరేగిస్తున్న వీడియో ఒకటి వెలుగుచూస్తే కానీ, అక్కడి తీవ్రత బాహ్య ప్రపంచానికి తెలియరాలేదు. కానీ, దీనికి నెలరోజుల ముందే నార్త్? అమెరికన్? మణిపూర్? ట్రైబల్? అసోసియేషన్? వంటి సంస్థలు జాతీయ మహిళా కమిషన్?కు చేసిన ఫిర్యాదులో మొత్తం ఆరు దారుణాలను ప్రస్తావిస్తే అందులో ఈ ముగ్గురు మహిళలకు సంబంధించిన రెండు ఘటనలూ ఉన్నాయి. మణిపూర్?లో జరుగుతున్నదేమిటో తెలిసి కూడా ఢిల్లీ పెద్దలతో పాటు, అత్యున్నత సంస్థలు, వ్యవస్థలు స్పందించలేదన్నది నిజం. కుకీ, మీతీ తెగల మధ్య సుదీర్ఘకాలం సాగిన ఆ ఊచకోతల్లో వందలమంది మరణించారు, అనేకమంది మహిళలు అత్యాచారాలకు గురైనారు. మీతీ ముఖ్యమంత్రి బీరేన్?సింగ్? ఒక పథకం ప్రకారం కుకీ--జోలపై ఈ హింసను అనుమతించి, మీతీలకు ఆశీస్సులతో పాటు ఆయుధాలు సైతం అందించి తీవ్రంగా అప్రదిష్టపాలైనా బీజేపీ పెద్దలు ఆయనను తప్పించడానికి ఇష్టపడలేదు. చివరకు సుప్రీంకోర్టు అక్షింతలు వేశాక, అవిశ్వాస తీర్మానంలో బీరేన్? ఓటమి ఖాయమని తేలడంతో దించేయాల్సి వచ్చింది. ఎట్టకేలకు గత ఏడాది సెప్టెంబర్?లో ప్రధాని మణిపూర్? సందర్శించినా, అక్కడ ఏమీ జరగనట్టు, తానేమీ ఎరగనట్టుగా ప్రవర్తించి వచ్చేశారు. మణిపూర్?ను రాష్ట్రపతి పాలనలోకి తెచ్చి వచ్చేనెలకు ఏడాది అవుతోంది. అయినా, బాధిత కుటుంబాల వారికి అదే నిర్లక్ష్యం, నిర్లిప్తత, బాధ్యతారాహిత్యం ఎదురవుతున్నాయి. ఇప్పుడు కన్నుమూసిన యువతి కేసు సహా ఇలా జీరో ఎఫ్?ఐఆర్?లు నమోదు చేసినవేవీ ముందుకు కదల్లేదని, నిందితులను గుర్తించడం, పట్టుకోవడం జరగలేదని మీడియా విశ్లేషిస్తోంది. స్థానిక పోలీసు స్టేషన్లనుంచి సీబీఐ చేతుల్లోకి పోయిన కేసుల్లో ఈమెది కూడా ఒకటి. కేసులు తేల్చకుండా, మూయకుండా ఒక నిస్సిగ్గు నాటకం అలాగే కొనసాగుతోంది. ఇద్దరు యువతులను నగ్నంగా ఊరేగించిన ఘటన దేశాన్ని కుదిపేసింది కనుక, దానికి కారకులైనవారిలో కొందరిని మాత్రం అరెస్టుచేసి సీబీఐ కేసులు పెట్టింది. బిష్ణుపూర్ కొండల్లోనూ, మీతీ మిలిటెంట్ల చేతుల్లోనూ సామూహిక అత్యాచారానికి గురైన ఈ కుకీ యువతికి మరణానంతర న్యాయమైనా చేకూర్చమని కుకీ జో సంఘాలు చేస్తున్న డిమాండ్లు, ప్రార్థనలు ఫలిస్తే సంతోషం.

# నీటి వివాదాలకు సామరస్యమే పరిష్కారం



తెలుగు రాష్ట్రాలు విడిపోయి దశాబ్దం దాటినా నీటి వివాదం మాత్రం ఇంకా సమసిపోలేదు. కృష్ణా, గోదావరి జలాల పంపిణీ విషయంలో ఆంధ్రప్రదేశ్- తెలంగాణల మధ్య కొనసాగుతున్న వివాదం చూస్తే, 'ఇది నిజంగా పరిష్కారం కాని సమస్యేనా? అనే ప్రశ్న తలెత్తుతుంది. కృష్ణా నీటి వివాద పరిష్కారానికి చట్టాలున్నాయి, కమిషన్లున్నాయి. బచావత్ ట్రిబ్యునల్, బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ వంటి బోర్డులు, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ... అన్నీ ఉన్నాయి. కానీ, నీటిని రాజకీయ అస్త్రంగా మార్చడంతోనే అసలు సమస్య మొదలవుతోంది. కృష్ణానది వార్షిక సగటు నీటి లభ్యత 2,578 టీఎంసీలు. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్?కు 811 టీఎంసీల నీటిని కేటాయించారు. 2014లో రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలు (సుమారు 63శాతం), తెలంగాణకు 299 టీఎంసీల (సుమారు 37 శాతం) కేటాయింపులపై, అప్పటి ముఖ్యమంత్రులుగా ఉన్న చంద్రబాబు, కేసీఆర్ సమక్షంలో అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఒప్పందం జరిగింది. ఇవి తాత్కాలిక ఏర్పాట్లు మాత్రమే, శాశ్వత కేటాయింపులు కావు. తెలంగాణకు 299 టీఎంసీలు చాలని అపెక్స్ కౌన్సిల్?లో సంతకం చేసిన కేసీఆర్, అధికారం దూరమయ్యాక నేడు జల రాజకీయం చేస్తున్నారు. ప్రజల్లో భావోద్వేగాలు, సెంటిమెంటును రగిలించి రాజకీయంగా లబ్ధిపొందాలన్న దురాశతోనే నీటి నిప్పును రాజేస్తున్నారు. చంద్రబాబును బూచిగా చూపుతున్నారు. బీఆర్?ఎస్ చేస్తున్న ప్రచారంతో తామెక్కడ రాజకీయంగా వెనుకబడిపోతామోననే భయంతో కాంగ్రెస్ పార్టీ కూడా బీఆర?స్?కు వంత పాడుతోంది. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి కావాలంటే జూరాల నుంచి వరద నీటిని ఆ ప్రాజెక్టుకు తరలించాలి. అలా అయితే ఏపీ, తెలంగాణ మధ్య నీటి వివాదం ఉండదు. కానీ పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి శ్రీశైలం నుంచి నీటిని తీసుకుంటామనడంతోనే వివాదం మొదలైంది. తెలంగాణ కొత్త ప్రాజెక్టుల (కాళేశ్వరం, పాలమూరు--రంగారెడ్డి) ద్వారా ఎగువ ప్రాంతాల్లోనే ఎక్కువ నీటిని నిల్వ చేసుకుంటోంది. ఆంధ్రప్రదేశ్ దిగువన ఉండటంతో, సమయానికి నీరు రాకపోవడం ప్రధాన సమస్య. కృష్ణా డెల్టా రైతాంగంపై దీని ప్రభావం తీవ్రంగా పడుతోంది. గోదావరి నది సగటు నీటి లభ్యత 3,000 టీఎంసీలకు పైగా ఉంది. వాస్తవ వినియోగం కేవలం 1,500 టీఎంసీలకు లోపే. అంటే సగం కంటే ఎక్కువ నీరు సముద్రంలోకి వృథాగా పోతోంది. ఇక్కడే వివాద పరిష్కారానికి కీలక దారి ఉంది. గోదావరి నీటిని సమర్థవంతంగా వినియోగిస్తే కృష్ణాపై ఒత్తిడి తగ్గుతుంది. రాష్ట్రాల మధ్య వివాద తీవ్రత కూడా తగ్గే అవకాశం ఉంటుంది. 2019లో తెలుగు రాష్ట్రాల సీఎంలు జగన్, కేసీఆర్ ఇద్దరూ హైదరాబాద్?లోని ప్రగతి భవన్?లో సమావేశమై అలై బలై నిర్వహించారు. కృష్ణానదిలో నీటి లభ్యత తక్కువని, అందుకే గోదావరి నీటిని ఉపయోగించుకుని రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల సాగునీటి సమస్యను పరిష్కరించుకోవాలని నిర్ణయించారు. తాము వేసిన ఈ అడుగు దేశానికే ఆదర్శంగా నిలుస్తుందంటూ ముఖ్యమంత్రులిద్దరూ సుద్దులు చెప్పారు! "నదీ జలాల వివాద పరిష్కారానికి ట్రిబ్యునళ్లకు వెళ్లడం, సుప్రీంకోర్టును ఆశ్రయించడం, కేంద్ర ప్రభుత్వం వద్దకు వెళ్లడం వల్ల ప్రయోజనం ఉండదు" అంటూ నాడు కేసీఆర్ జలకథలు చెప్పారు. అంతేకాదు, 'గోదావరి, కృష్ణా నదుల్లో కలిపి ఏటా దాదాపు 4 వేల టీఎంసీలు సముద్రం పాలవుతున్నాయి. ఈ నీళ్లతో రెండు రాష్ట్రాలను సస్యశ్యామలం చేయవచ్చు. వంశధార, నాగావళి, నదుల నీళ్లను కూడా బంగాళాఖాతం పాలు కాకుండా సమర్థంగా వినియోగిస్తే ఉత్తరాంధ్ర వాసుల నీటి కరువు కూడా తీరుతుంది' అంటూ కేసీఆర్? నమ్మబలికారు. నాడు ఆయన చెప్పిన ఆదర్శాలన్నీ ఏమయ్యాయి?! ప్రస్తుతం తెలంగాణలో బీఆర్ఎస్ నాయకులకు రాజకీయ మనుగడ లేదు. ప్రజల్లో సెంటిమెంట్?ను రగిలించడమే లక్ష్యంగా వారు జల రాజకీయం చేస్తున్నారు. సముద్రంలోకి వృథాగా పోతున్న జలాలనే నల్లమలకు తీసుకెళ్తుంటే తెలంగాణకు జరిగే నష్టం ఏమిటో అర్థం కావడం లేదు. తెలంగాణలో గోదావరిపై కాళేశ్వరం ప్రాజెక్ట్ కింద మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజ్?లు కట్టారు. మహారాష్ట్రలో పుట్టిన గోదావరి మొదట తెలంగాణలో, అనంతరం ఏపీలో ప్రవహిస్తూ అంతర్వేది మీదుగా సముద్రంలో కలుస్తుంది. ఏపీలో గోదావరిపై ధవళేశ్వరం మాత్రమే ప్రధాన ప్రాజెక్ట్?గా ఉంది. ప్రస్తుతం పోలవరం నిర్మాణంలో ఉన్నది. గోదావరి నీళ్లు తరలించడం ద్వారా పల్నాడు, రాయలసీమ, వెలిగొండ, ప్రకాశం ప్రాంతాల ప్రజల సాగునీటి కష్టాలు తీర్చాలని ఏపీ సీఎం చంద్రబాబు ప్రయత్నం చేస్తున్నారు. గోదావరి నుంచి 200 టీఎంసీలు నల్లమల ప్రాజెక్టుకు తరలించడం ద్వారా కృష్ణా నీటిపై ఒత్తిడి తగ్గుతుంది. ఆ నీటిని తెలంగాణకు వాడుకోవచ్చు. తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాన్ని న్యాయపోరాటాల కంటే సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవడమే ఉత్తమమని తెలంగాణ, ఏపీలకు సుప్రీంకోర్టు సూచన చేయడం అభినందనీయం. రెండు రాష్ట్రాల సీఎంలు కూర్చుని మాట్లాడుకుంటే సమస్య పరిష్కారం అవుతుంది. నీటిని రాజకీయ అస్త్రంగా కాకుండా, అభివృద్ధి వనరుగా చూడాలి.

## నాడు దిశానిర్దేశనం... నేడు సమగ్రాభివృద్ధి



విజయవాడలో 1965లో జరిగిన భారతీయ జనసంఘ్ జాతీయ మహాసభ సాధారణ రాజకీయ సమావేశం కాదు. అది స్వాతంత్ర్యానంతరం భారతదేశానికి దిశా నిర్దేశనంతో పాటు ఏ మార్గంలో అభివృద్ధి జరగాలి అన్న ప్రశ్నలకు సమాధానంగా నిలిచిన ఒక ఆలోచన. పాశ్చాత్య దేశాల మాదిరిగా యాంత్రిక అభివృద్ధిని గుడ్డిగా అనుసరించాలా లేదా మన సంస్కృతిని, సమాజాన్ని కాపాడుకుంటూ ఆధునికతను స్వీకరించాలా ఈ సందిగ్ధంలో జనసంఘ్ స్పష్టంగా చూపిన బాట--భారతీయత ఆధారంగా భారతదేశ అభివృద్ధి ఉండాలి అని. జనవరి 23 నుంచి 26 వరకూ జరిగిన నాటి ఈ భారతీయ జనసంఘ్ 12వ వార్షిక మహాసభ ఒక మైలురాయి. ఇక్కడే, ఆధునిక హిందూ జాతీయవాద ఆలోచనాస్రష్ట పండిత దీనదయాళ్ ఉపాధ్యాయ... పాశ్చాత్య భౌతికవాదం, మార్క్సిస్టు సిద్ధాంతాల దుష్ట ప్రభావాలను తిరస్కరిస్తూ, భారతీయ సనాతన జ్ఞాన సంప్రదాయంపై ఆధారితమైన ఏకాత్మ మానవత అనే సమగ్ర తత్వశాస్త్రాన్ని ప్రకటించారు. ఏకాత్మ మానవత అభివృద్ధిని ఆపేది కాదు. అభివృద్ధికి దిశ చూపించేది. అభివృద్ధి అంటే-- గ్రామం నుంచి రాజధాని వరకూ సమాన అవకాశాలు కల్పించడం; పేదరికం నిర్మూలనతో పాటు స్వాభిమానాన్ని నిర్మించడం; ఆర్థిక బలంతో పాటు సాంస్కృతిక ఆత్మవిశ్వాసం పెంపొందించడం. ఈ మహాసభకు 60 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రస్తుత బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ ఆధ్వర్యంలో అదే విజయవాడలోనే ఈ నెల 23, 24 తేదీలలో జరగనున్న సదస్సులో ఎనిమిది కాలాంశాలు 'నేటి కాలానికి ఏకాత్మ మానవ దర్శనం ఆవశ్యకత', 'రాజకీయ, సాంస్కృతిక దృష్టికోణం, భారతీయత--ప్రపంచ వ్యాప్తంగా దాని ప్రభావం', 'ఆర్థిక పరిపుష్టి- వికేంద్రీకరణ, సమగ్ర ఆలోచనా విధానం ద్వారా విశ్వదర్శనం- భారతీయ రక్షణ', 'ఏకాత్మ మానవ దర్శనం ద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన', సమకాలీన అనువర్తనాలు-భవిష్యత్తు కార్యాచరణ లాంటి అనేక అంశాలను చర్చిస్తారు. 1965 మహాసభను ఒక సాధారణ సమావేశంగా చూడకూడదు; ఇది ఒక దార్శనిక పరివర్తన. ఈ మహాసభలో అధ్యక్షులుగా ఎన్నికైన దీనదయాళ్... జనసంఘ్ పార్టీ 'సూత్రాలు-- విధానాలు' ద్వారా ఏకాత్మ మానవతను ప్రధాన భావనగా స్థాపించారు. ఈ తత్వం భారతదేశాన్ని ఒక సజీవ సమష్టిగా భావిస్తూ, భౌతిక పురోగతిని ఆధ్యాత్మిక సంపూర్ణతతో ఏకీకృతం చేస్తుంది. ఈ సిద్ధాంతం బలవంతంగా భారతీయులపై రుద్దుతున్న పాశ్చాత్య భావజాలాల్ని, సిద్ధాంతాలను వ్యతిరేకిస్తూ, భారతీయ ధర్మ--సంస్కృతికి అనుగుణమైన విధానాలను దీనదయాళ్ జీ ప్రతిపాదించారు. ఇందులోని కీలకమైన సూత్రాలు... అంత్యోదయ- సమాజంలోని అంతిమ వ్యక్తి (చిట్టచివరి వ్యక్తి) ఉద్ధరణను ప్రధాన లక్ష్యంగా చేసుకోవడం. స్వదేశీ, స్వావలంబన-- విదేశీ ఆధారితను తగ్గించి, స్థానిక ఆవిష్కరణలు, వనరులను ఉపయోగించడం. వికేంద్రీకరణ-- కేంద్రీకృత శక్తి నుంచి గ్రామీణ, స్థానిక స్థాయిలకు అధికార వికేంద్రీకరణ. నైతిక ఆర్థికత-- లాభాపేక్షకు మించి, సామాజిక శ్రేయస్సును ప్రోత్సహించే ఆర్థిక వ్యవస్థ. ఈ మహాసభ నేపథ్యంలో దీనదయాళ్ జీ సాంస్కృతిక స్వాభిమానాన్ని, సమగ్రాభివృద్ధి ప్రణాళికలను బలపరచడం ద్వారా, జనసంఘ్‌ను ఒక రాజకీయ శక్తిగా ఎదిగేలా చేశారు. 1965లో జనసంఘ్ కలగన్న ఆలోచనలే 2014 నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో ప్రత్యక్ష రూపం దాల్చాయి. స్వదేశీ ఆర్థిక దృష్టి, ఆత్మనిర్భర్ భారత్, మౌలిక సదుపాయాల విప్లవం, జాతీయ భద్రతలో స్పష్టత, విదేశాంగ విధానంలో సమర్థత లాంటివి లోతుగా అమలు చేస్తూ, విశ్వశక్తిగా మన దేశం ఎదుగుతోంది. ఆత్మనిర్భర్ భారత్-- స్వదేశీ ఉత్పాదనను ప్రోత్సహిస్తూ, విదేశీ ఆధారితను తగ్గించడం. ఇది దీనదయాళ్ గారి స్వావలంబన సూత్రానికి సాక్ష్యం. ఉదాహరణకు మేకిన్ ఇండియా. అంత్యోదయ సాకారం-- పీఎం కిసాన్?, వీబీ జీరామ్?జీ చట్టాలు, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలు అణగారిన వర్గాల జీవితాల్ని మారుస్తున్నాయి. సాంస్కృతిక పునరుత్థానం-- ఆర్టికల్ 370 రద్దు, అయోధ్య రామమందిర నిర్మాణం, యోగా--ఆయుర్వేద ప్రపంచీకరణ లాంటివి ఏకాత్మ మానవతా ఆధ్యాత్మిక పునరుజ్జీవనాన్ని ప్రతిబింబిస్తాయి. డిజిటల్ వికేంద్రీకరణ-- డిజిటల్ ఇండియా, యూపీఐ వంటివి ప్రజల ఆర్థిక స్వావలంబనను పెంచుతున్నాయి. పర్యావరణ సమతుల్యత-- ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్, గ్రీన్ ఎనర్జీ వంటి కార్యక్రమాలు మానవ--ప్రకృతి సమన్వయాన్ని బలపరుస్తాయి. జాతీయ భద్రత--స్వదేశీ రక్షణ పరికరాలు (తేజస్ ఫైటర్, బ్రహ్మోస్ మిస్సైల్స్), 5 ట్రిలియన్ డాలర్? ఆర్థిక లక్ష్యాలు సమగ్ర అభివృద్ధి ఫలితాలు. 2023 జీ--20 సమ్మిట్?లో 'ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు' అనే థీమ్, వసుధైక కుటుంబకం ఆధునిక వ్యాఖ్యానం. ఈ ఆలోచన భారతదేశాన్ని విశ్వగురుగా స్థాపిస్తుంది. అయితే, ఈ విజయాలు సవాళ్లు లేకుండా రాలేదు. ఆధునిక కాలంలో విభజనవాద శక్తులు, గ్లోబల్ అనిశ్చితులు లాంటివి ఎదురైనా తట్టుకుని ముందుకు వెళుతున్నాం. ఈ నెలలో ఆంధ్రప్రదేశ్?లో జరగనున్న సదస్సు 1965 మహాసభను పునఃస్మరణ చేస్తూ 'దీనదయాళ్ జీ దృక్పథం ఎలా అభివృద్ధిని సమగ్రంగా రూపొందించింది, ఆధునిక భారతదేశం దానిని ఎలా సాకారం చేస్తోంది' అనే అంశాలపై లోతైన చర్చలు జరపనుంది. ఈ సదస్సు కేవలం గతాన్ని గుర్తు చేసుకోవడం కోసమే కాదు, భవిష్యత్తును రూపొందించుకోవడం కోసం కూడా. "మనం జీవితాన్ని సమగ్ర దృష్టితో చూడాలి" అని దీనదయాళ్ జీ అనేవారు. నేటి తరానికి ఏకాత్మ మానవతా దర్శనం చక్కటి మార్గదర్శకం చేస్తుందనడంలో సందేహం లేదు.

## ఐపీవోకి జెప్టో..




**న్యూఢిల్లీ :** క్విక్ కామర్స్ సేవల సంస్థ జెప్టో..స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టడానికి సిద్ధమవుతున్నది. ఇందుకు సంబంధించి స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి దరఖాస్తు చేసుకున్నది. వాటాల విక్రయం ద్వారా గరిష‘ంగా రూ.11 వేల కోట్ల నిధులను సమీకరించాలని యోచిస్తున్నది. వచ్చే ఏడాది మార్కెట్లో లిస్ట్ కానున్న అతి పిన్న వయస్సు కలిగిన స్టార్టప్‌లలో ఇది కూడా ఒకటికానున్నది. ఇప్పటికే మార్కెట్లోకి అడుగుపెట్టిన జోమాటో, స్విగ్గీలకు పోటీగా జెప్టో..ఐపీవోకి రాబోతున్నది. 7 బిలియన్ డాలర్ల విలువ కలిగిన జెప్టో..ఈ ఐపీవో ద్వారా 1.8 బిలియన్ డాలర్లు లేదా రూ.16 వేల కోట్ల నిధులు సమీకరించాలని యోచిస్తున్నది. ఈ అక్టోబర్ నెలలో సంస్థ రూ.3,757 కోట్ల నిధులను సమీకరించింది.

## ఐటీఆర్ రిఫండ్ ఆలస్యమా..

**కారణాలు ఇవి కావచ్చు..**




**న్యూఢిల్లీ :** మీ ఆదాయ పన్ను (ఐటీ) రిఫండ్ బ్యాంక్ ఖాతాలో ఎప్పుడు జమ అవుతుందా? అని మీరు ఇప్పటికీ వేచి చూస్తున్నారా?.. అసలు ఈ ఏడాది ఇంత సమయం ఎందుకు పడుతున్నది? అని ఆశ్చర్యపోతు న్నారా?.. నిజానికి హై-వాల్యూ రిఫండ్ క్లెయిముల పరిష్కారానికి అదనపు వ్యవస్థీకృత పరిశీలనలుంటాయి. పైగా సెక్షన్ 143(1) ప్రకారం ఐటీ శాఖకు 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను దాఖలైన ఐటీఆర్‌ల ప్రక్రియ కోసం వచ్చే ఏడాది డిసెంబర్ 31దాకా సమయం ఉన్నది. అలాగే ఐటీ చట్టం 1961లోని సెక్షన్ 245(2) కింద కొన్ని పరిస్థితుల్లో రిఫండ్స్ తిరిగి వెనుకకు వెళ్లిపోతాయి. అయితే దీనికి వ్యవస్థీకృత కారణాలేమీ పెద్దగా ఉండవు. ట్యాక్స్‌పేయర్స్ ద్వారా జరిగిన తప్పిదాలే ఎక్కువగా కారణమవుతూ ఉంటాయి. కాగా, మీ బ్యాంక్ ఖాతా అప్‌డేట్ అవ్వకపోయినా రిఫండ్స్ ఆలస్యం కావచ్చు. కాబట్టి ఈ-ఫైలింగ్ పోర్టల్‌పై మీ ప్రొఫైల్‌లో సరైన బ్యాంక్ ఖాతా వివరాలనే ఉంచాలి. ఇక ఈ-ఫైలింగ్ వెబ్‌సైట్ పేజీ **https://www.incometax.gov.in/iec/foporta**ని సందర్శించి కూడా రిఫండ్ స్టేటస్‌ను తెలుసుకోవచ్చు.

**గుర్తుంచుకోండి..**

మీ ఐటీఆర్ పరిశీలన 30 రోజుల్లోగా పూర్తికాకపోతే దాన్ని ఇన్‌వాలిడ్‌గా పరిగణిస్తారన్న విషయం మీకు తెలుసా? ప్రస్తుత సీబీడీటీ నిబంధనల ప్రకారం ఆన్‌లైన్‌లో ఐటీ రిటర్న్ దాఖలైతే 30 రోజుల్లోగా వెరిఫై కావాల్సిందే. ఇది ఇ-వెరిఫికేషన్ ద్వారానైనా లేదా బెంగళూరు సీపీసీకి సంతకమైన వెరిఫై ఐటీఆర్ భౌతిక కాపీని పంపడం ద్వారానైనా అవు తుంది. ఇక చాలామంది రిటర్న్‌ను దాఖలు చేసినా సకాలంలో దాన్ని వెరిఫై చేయడం మర్చిపోతారు. దాంతో డెడ్‌లైన్ ముగిసి అది పనికిరాకుండా పోతుంది.


## లక్ష దాటిన పెట్రోల్ పంపులు




న్యూఢిల్లీ, డిసెంబర్ 25: దేశవ్యాప్తంగా పెట్రోల్ బంకులు లక్ష దాటిపోయాయి. ప్రభుత్వరంగ సంస్థలు అత్యధికంగా పెట్రోల్ బంకులను ఏర్పాటు చేయడానికి మొగ్గుచూపడంతో ఈ ఏడాది ఇప్పటి వరకు దేశీయంగా 1,00,266 పెట్రోల్ బంకులు అందుబాటులోకి వచ్చాయి. వీటిలో 90 శాతం ప్రభుత్వరంగ సంస్థలైన ఐవోసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నడుస్తున్న బంకులు ఉండటం విశేషం. అలాగే ప్రపంచ దేశాల్లో మూడో అతిపెద్ద దేశంగా భారత్ నిలిచినట్లు పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలసిస్ సెల్ తాజాగా వెల్లడించింది. తొలి స్థానంలో అమెరికా ఉండగా, ఆ తర్వాత స్థానంలో చైనా నిలిచింది. వీటితోపాటు ప్రైవేట్ సంస్థలైన నయారా, రిలయన్స్-బీపీ, షెల్‌లు సంయుక్తంగా 10 వేల వరకు నిర్వహిస్తున్నాయి. 2015లో దేశవ్యాప్తంగా 50 వేల స్థాయిలో ఉన్న పెట్రోల్ బంక్‌లు కేవలం పదేండ్లలో రెండింతలు పెరుగడం విశేషం.

# డిజిటలైజేషన్‌లో యూటర్న్!..

## ఆన్‌లైన్‌లో కొత్త ఖాతాల విషయంలో బ్యాంకర్లు అప్రమత్తం



న్యూఢిల్లీ : కొత్త ఖాతాల విషయంలో బ్యాంకర్లు డిజిటలైజేషన్ కంటే సంప్రదాయ పద్ధతులకే మొగ్గు చూపుతున్నారు. ఆన్‌లైన్ ద్వారా బ్యాంక్ ఖాతాలను తెరువాలని కోరుకునే కస్టమర్ల కోసం బడా బ్యాంకు లు ఇప్పుడు భౌతిక పరిశీలనలకే ఆసక్తి కనబరుస్తున్నాయి మరి. మ్యూల్ అకౌంట్లు, మోసాల నేపథ్యంలో కస్టమర్ల ఇంటికే రిలేషన్‌షిప్ మేనేజర్లు వెళ్లి పనిని పూర్తిచేస్తున్నారు. లేకపోతే కస్టమర్లను సమీప బ్యాంక్ శాఖలకు రావాలని బ్యాంక్ వర్గాలు కోరుతున్నాయి.

**బడా బ్యాంకుల్లో..**

ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియాలు తమ ఎండ్-టు-ఎండ్ డిజిటల్ ఆన్‌బోర్డింగ్ వ్యవస్థల్ని పక్కనపెట్టినట్టు తెలుస్తున్నది. ఐసీఐసీఐ బ్యాంక్ తమ ఇన్‌స్టా-అకౌంట్ ఓపెనింగ్ సర్వీస్‌ను ఆపేసిందని సమాచారం. కేవలం సాలరీ ఖాతాలకే డిజిటల్ ప్రక్రియను వినియోగిస్తున్నట్టు చెప్తున్నారు. మిగతా ఖాతాలను ఆశించే కస్టమర్లు డాక్యుమెంట్స్ సమర్పణకు సమీప బ్యాంక్ శాఖకు వెళ్లాలని బ్యాంక్ అధికారులు సూచిస్తున్నారు. దరఖాస్తుల పరిశీలనకు కస్టమర్ల ఇండ్లకే బ్యాంక్ అధికారులూ వెళ్తున్నారని బ్యాంక్ వర్గాలు చెప్తున్నాయి. పైగా పెరుగుతున్న మోసాలకు నో యువర్ కస్టమర్ (కేవైసీ) నిబంధనలను పాటించకపోవడమేనంటూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) బ్యాంకులపై జరిమానాలనూ వేస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఈ ఫైన్ల నుంచీ తప్పించుకున్నట్టు అవుతుందని చాలా బ్యాంకులు భౌతిక పరిశీలనలకే జై కొడుతున్నాయి.

**మ్యూల్ ఖాతాల సెగ**

అమాయక ఖాతాదారులను ఏమార్చి నేరగాళ్లు.. తమ అక్రమ కార్యకలాపాల నుంచి ఆర్జించిన సొమ్మును పొందడానికి, బదిలీ చేయడానికి వారి బ్యాంక్ ఖాతాలను వాడుకుంటూ ఉంటారు. మనకు తెలియకుండానే మోసపూరితంగా మన డాక్యుమెంట్లను వాడుకుని బ్యాంకుల్లో మన పేరిట ఖాతాలనూ తెరుస్తారు. వీటినే మ్యూల్ అకౌంట్స్ అంటారు. అయితే ఈ వ్యవహారాన్ని బ్యాంకులు గుర్తిస్తే సదరు ఖాతాలు మూతబడిపోతాయి. అంతేగాక దీంతో ప్రమేయంలేని అమాయకులు సమస్యల్లో పడుతారు. భవిష్యత్తులో వారికి బ్యాంకింగ్ లావాదేవీలు కష్టతరంగా మారుతాయి. ఇక ఇటీవలికాలంలో ఈ మ్యూల్ అకౌంట్స్ పెరిగిపోతున్నాయి. గత ఏడాది పెద్దపెద్ద బ్యాంకుల్లో మోసపూరిత నగదు లావాదేవీలు భారీగానే జరిగినట్టు గుర్తించారు. అందుకే ఆన్‌లైన్ అకౌంట్ ఆన్‌బోర్డింగ్ సర్వీసు నిబంధనల్ని కఠినతరం చేస్తున్నామని బ్యాంక్ సిబ్బంది అంటున్నారు. డిజిటల్ బ్యాంకింగ్ మార్గాల ద్వారా నకిలీ డాక్యుమెంట్లతో ఖాతాలు తెరుస్తున్న వైనాన్ని అడ్డుకునే దిశగా బ్యాంకులు వెళ్తున్నాయని, అందుకే కస్టమర్లను నేరుగా సంప్రదించాకే ఖాతాలను తెరుస్తున్నాయని ఓ ఫ్రాడ్ డిటెక్షన్ స్టార్టప్ వ్యవస్థాపకుడు తెలిపారు.

**బ్యాంకర్ల మాటేంటి?**

మ్యూల్ ఖాతాలను గుర్తించి సకాలంలో వాటిని మూసేయకపోతే ఆర్బీఐ జరిమానా వేస్తున్నదని బ్యాంకర్లు చెప్తున్నారు. అందుకే ఆన్‌లైన్‌లో ఖాతాల కోసం వచ్చిన దరఖాస్తులపట్ల అప్రమత్తంగా ఉంటున్నామని పేర్కొంటున్నారు. అయినప్పటికీ కొత్త ఖాతాలకు డిజిటలైజేషన్ ఎంతో ముఖ్యమని కూడా వివరిస్తున్నారు. కాబట్టి కస్టమర్లను నేరుగా కలిసేందుకు ప్రయత్నిస్తున్నామని ప్రధాన బ్యాంక్‌లోని ఓ ఉన్నతోద్యోగి తెలిపారు. ఇక ఖాతాదారులకు ఈ మోసాల గురించి అవగాహన కల్పిస్తున్నాయి బ్యాంకులు. కార్డ్ నెంబర్లు, ఏటీఎం పిన్ నెంబర్లు, ఓటీపీలు ఎవ్వరికీ చెప్పరాదని సూచిస్తున్నాయి.

**ఇదీ సంగతి..**

కేంద్రంలో మోదీ సర్కారు అధికారంలోకి వచ్చిన దగ్గర్నుంచి బ్యాంకింగ్ వ్యవస్థలో ఆన్‌లైన్ ప్రాధాన్యత పెరిగిపోయింది. అన్నీ ఆన్‌లైన్‌లోనే అన్నట్టు తయారైంది. ఇక పాత పెద్ద నోట్ల రద్దుతో డిజిటల్ పేమెంట్స్ ఊపందుకున్నాయి. కానీ ఇదే సమయంలో బ్యాంక్ మోసాలు కూడా భారీగానే పెరుగడం గమనార్హం. అందరి చేతికి స్మార్ట్‌ఫోన్లు రావడంతో ఇంటర్నెట్ అంతటా విస్తరించింది. 4జీ, 5జీ సేవలు మొదలవడంతో ఇటీవలికాలంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) వాడకం సైతం పుంజుకున్నది. ఈ నేపథ్యంలో సైబర్ మోసగాళ్లు మరింత రెచ్చిపోతున్నారు. దీంతో బ్యాంకులు అప్రమత్తమవుతున్నాయి. ఇందులో భాగంగానే పాత సంప్రదాయ పద్ధతులే సురక్షితం అన్న అభిప్రాయానికి వచ్చేస్తున్నారు. అందుకే తమ డిజిటల్ ఆన్‌బోర్డింగ్ ప్రాసెస్‌లోకి ఫిజికల్ చెక్స్ (భౌతికంగా పరిశీలనలు)ను పరిచయం చేస్తున్నారు.

# పడిపోయిన ఇండ్ల అమ్మకాలు



**హైదరాబాద్ :** హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం మందగమనం దిశగా వెళ్తున్నది. భారతీయ ప్రధాన రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్లలో ఒకటైన అనరాక్ శుక్రవారం విడుదల చేసిన గణాంకాలే ఇందుకు నిదర్శనం. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన దగ్గర్నుంచి దాదాపు పదేండ్లపాటు పరుగులు పెట్టిన ఇక్కడి నిర్మాణ రంగం.. గతకొంత కాలంగా కళ తప్పిందనే చెప్పవచ్చు. ముఖ్యంగా రాష్ట్రంలో అధికారం మారినప్పటి నుంచి నెలకొన్న పరిణామాలు.. ఇండ్ల కొనుగోళ్లకు బ్రేకులు వేశాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వ నిర?యాలు రియల్టీని ఉత్సాహపరిస్తే.. ప్రస్తుతం మాత్రం ఆ రకమైన ప్రోత్సాహం కరువైందన్న ఆవేదన మెజారిటీ రియల్టర్లలో కనిపిస్తుండటం గమనార్హం.

**ఇదీ సంగతి..**

ఈ ఏడాది హైదరాబాద్‌లో నివాస గృహాల విక్రయాలు గత ఏడాదితో పోల్చితే 23 శాతం తగ్గాయని అనరాక్ తమ తాజా గణాంకాల్లో వెల్లడించింది. దేశవ్యాప్తంగా 7 ప్రధాన నగరాల్లో ఇండ్ల అమ్మకాల తీరుతెన్నులపై అనరాక్ ఓ నివేదికను తీసుకొచ్చింది. ఈ నగరాల్లో హౌజింగ్ సేల్స్‌పరంగా అన్నింటికంటే హైదరాబాద్‌లోనే ఎక్కువ క్షీణత కనిపిస్తుండటం మిక్కిలి గమనించదగ్గ అంశం. 2024లో 58,540 యూనిట్ల విక్రయాలు నమోదైతే..2025లో 44,885 యూనిట్లకే పరిమితమయ్యాయి. హైదరాబాద్ సహా ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్), ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరు, పుణె, కోల్‌కతా, చెన్నై నగరాల్లో రెసిడెన్షియల్ సేల్స్‌పై అనరాక్ రిపోర్టు ఇచ్చింది. అయితే చెన్నై మినహా అన్ని నగరాల్లో ఇండ్ల అమ్మకాలు పతనమయ్యాయి. 2024తో పోల్చితే 2025లో 15 శాతం పెరిగి 19,220 యూనిట్ల నుంచి 22,180 యూనిట్లకు చేరుకున్నాయి. దీంతో మొత్తంగా చూసినైట్టైతే 14 శాతం క్షీణత చోటుచేసుకున్నది. 2025లో ఈ ఏడు నగరాల్లో ఇండ్ల విక్రయాలు 3,95,625 యూనిట్లుగానే ఉన్నట్టు తేలింది. 2024లో 4,59,645 యూనిట్లుగా ఉన్నాయి. కాగా, అధిక ధరలు, ఐటీ తదితర రంగాల్లో ఉద్యోగుల తొలగింపులతో తగ్గిన డిమాండ్, భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చిత పరిస్థితులు ఇందుకు కారణమంటూ మార్కెట్ సరళిని అనరాక్ విశ్లేషించింది. అయితే పెరిగిన రేట్ల దృష్ట్యా విలువపరంగా అమ్మకాలు 6 శాతం పెరిగి రూ.6 లక్షల కోట్లకు చేరాయన్నది. నిరుడు రూ.5.68 లక్షల కోట్లే. అలాగే ఈ ఏడు నగరాల్లో ఇంటి ధర సగటున 8 శాతం ఎగిసినట్టు పేర్కొన్నది. సరిగ్గా ఏడాది క్రితం చదరపు అడుగు రూ.8,590 పలికితే.. ఇప్పుడు రూ.9,260గా ఉన్నట్టు అనరాక్ ఈ సందరరేగా తమ నివేదికలో తెలియజేసింది.

**ప్లాటెడ్ డెవలప్‌మెంట్లపై నజర్**

దేశంలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్లంతా ఇప్పుడు ప్లాటెడ్ డెవలప్‌మెంట్లపై దృష్టిసారిస్తున్నారు. ఒకప్పుడు అసంఘటిత రియల్టర్లు మాత్రమే ఈ ప్లాట్ల (భూములు) అమ్మకాల్లో ఎక్కువగా ఉండేవారు. ప్రధాన సంస్థలన్నీ భూములను కొని, వాటిలో ఇండ్లు, అపార్ట్‌మెంట్లు నిర్మించి అమ్ముతుండేవి. అయితే ఇప్పుడు బడా సంస్థలు సైతం పెద్ద ఎత్తున భూములను కొని, వాటిని చిన్నచిన్న ప్లాట్లుగా మార్చి, అన్ని సదుపాయాలు (రోడ్లు, త్రాగునీరు, విద్యుత్తు అనుమతులు) కల్పించి విక్రయానికి పెడుతున్నాయి. డీఎల్‌ఎఫ్, గోద్రెజ్ ప్రాపర్టీస్, బ్రిగేడ్, ప్రెస్టీజ్, పురవంకర, మహీంద్రా లైఫ్‌స్పేసెస్, రుస్తుంజీ తదితర ప్రధాన రియల్ ఎస్టేట్ కంపెనీలు ఇలాంటి ట్రెండ్‌నే అనుసరిస్తున్నాయి. హైదరాబాద్ సహా బెంగళూరు, చెన్నై, గురుగ్రామ్, ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా వెంచర్లను తీసుకొస్తున్నాయి. హైదరాబాద్ మరికొన్ని నగరాల్లోనైతే ఎక్కువ డిమాండ్ కనిపిస్తున్నది. కాగా, జైపూర్, సోనిపట్, ఇండోర్, నాగ్‌పూర్, కోయంబత్తూర్, మైసూరు, సూరత్, రాయ్‌పూర్ వంటి కొన్ని ద్వితీయ శ్రేణి నగరాల్లోనూ ఈ తరహా మార్కెటింగ్ ఊపందుకుంటుండటం విశేషం. నిర్మాణ ప్రాజెక్టులతో ఆదాయం అందుకోవడానికి 4-6 ఏండ్లు పడుతున్నదని, ప్లాటెడ్ ప్రాజెక్టులతో 2-3 ఏండ్లలోనే వ్యాపారం చేసుకుంటున్నామని ఇండస్ట్రీ వర్గాలు చెప్తున్నాయి. కరోనా తర్వాత ప్రవాస భారతీయులు పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి కనబరుస్తుండటం, ఇండిపెండెంట్ హౌస్‌లకు డిమాండ్ కూడా కంపెనీలను ఈ ప్లాట్ల బిజినెస్ వైపునకు నడిపిస్తున్నది.


**ఆఫీస్ స్థలాలకు తగ్గిన డిమాండ్**

హైదరాబాద్‌లో ఆఫీస్ స్థలాలకు గిరాకీ పడిపోయింది. ఈ ఏడాది మూడో త్రైమాసికం(జూలై-సెప్టెంబర్ మధ్యకాలం) నగరంలో ఆఫీస్ స్థలాల డిమాండ్ 19 శాతం పడిపోయి 1.10 కోట్ల చదరపు అడుగుల విస్తీరా?నికి పడిపోయినట్టు కొలియర్స్ ఇండియా తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. మెట్రో నగరాలైన బెంగళూరు, ఢిల్లీ-ఎన్‌సీఆర్, చెన్నై, పుణె, కోల్‌కతాలో పెరుగుదల నమోదుకాగా, కేవలం హైదరాబాద్‌తోపాటు ముంబైలో తగ్గుముఖం పట్టినట్టు వెల్లడించింది.



## అది మాత్రం సస్పెన్స్

జయాపజయాలను పట్టించుకోకుండా సినిమాలు చేసుకుంటూ పోతుంటారు మలయాళ మందారం అనుపమ పరమేశ్వరన్. ఇటీవలే 'కిష్కింధపురి' రూపం లో విజయాన్ని కూడా తన ఖాతాలో వేసుకున్నారామె. వచ్చే ఫిబ్రవరికి అనుపమకు 30ఏళ్లు నిండుతాయి. ఈ విషయంపై ఓ ఇంటర్వ్యూలో ప్రస్తావిస్తూ.. పెళ్లి గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు అనుపమ. 'పెళ్లి చేసుకుంటాను. కానీ దానికి టైమ్ ఉంది. చేసుకుంటే మాత్రం కచ్చితంగా లవ్‌మ్యారేజే చేసుకుంటా. అది కూడా ఇంట్లోవాళ్లను ఒప్పించి చేసుకుంటా.' అని చెప్పారు అనుపమ. ఇంతకీ ప్రేమలో ఉన్నట్టా? లేనట్టా? అనడిగితే.. 'అది మాత్రం సస్పెన్స్..' అని సింపుల్‌గా సమాధానమిచ్చారు అనుపమ పరమేశ్వరన్. ప్రేమ వివాహం చేసుకుంటానని చెప్పడం ద్వారా ఇప్పటికే తను ప్రేమలో ఉన్నట్టు చెప్పకనే చెప్పిందంటూ కొందరు నెటిజన్లు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుంటే.. ఈ ఒక్క ఏడాది ఇప్పటివరకూ అన్ని భాషలూ కలిపి అనుపమ నటించిన ఆరు సినిమాలు విడుదలయ్యాయి. హీరోయిన్లలో ఇది నిజంగా రికార్డ్.



## ప్రేక్షకులకు గుర్తుండిపోవాలి..

'మిస్టర్ బచ్చన్' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన ముంబయి బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే. ఆ సినిమాలో తన అందం, అభినయంతో తెలుగు ప్రేక్షకులను మెప్పించింది. ఇటీవల 'కింగ్‌డమ్' సినిమాతో తెలుగువారికి మరింత దగ్గరైంది. ఈ చిన్నది నటించిన రెండు చిత్రాలు ఈ నెలలోనే విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. 'ఆంధ్ర కింగ్ తాలూకా'లో రామ్‌తో, 'కాంత' చిత్రంలో దుల్కర్ సల్మాన్‌తో జతకట్టింది. ఇలా వరుస ఆఫర్లతో బిజీగా మారిపోయిన ఈ హాట్ బ్యూటీ పంచుకున్న కబుర్లు ఇవి.. చిన్నప్పటి నుంచే కళల పట్ల అభిమానం ఉండేది. అందుకే ముంబయి యూనివర్సిటీ నుంచి పెర్ఫార్మింగ్ ఆర్ట్స్‌లో డిగ్రీ చేశాను. చదువుతో పాటు నటన, డ్యాన్స్‌లోనూ రాణించడానికి ప్రత్యేక కోర్సులు తీసుకున్నా. అవి నటనలో నైపుణ్యం పొందడానికి ఎంతగానో దోహదం చేశాయి. స్కూల్ డేస్ నుంచే డ్యాన్స్ అంటే ఆసక్తి ఉండేది. కల్చరల్ ఈవెంట్స్‌లో పోటీ చేసేదాన్ని. నాటకానుభవం కూడా ఉంది. స్టేజ్ ముందు కూర్చోవడం కన్నా స్టేజ్ మీద నటించడాన్నే ఇష్టపడేదాన్ని. దాంతో నటన నా జీవితంలో భాగంగా మారింది. ఆ ఆసక్తితోనే సినిమాల్లో అడుగుపెట్టా. క్లాసిక్ బాలీవుడ్ సినిమాలు చూడటం బాగా అలవాటు. ఒక సినిమా ప్రేక్షకులను మెప్పించడం చాలా అంశాలపై ఆధారపడి ఉంటుంది. కథ-కథనం ఆసక్తికరంగా సాగిపోవాలి. నటీనటులు ప్రాణం పెట్టాలి. ఇలా అన్నీ సమపాళ్లలో కుదిరినప్పుడే సినిమా ప్రేక్షకులను రంజింపజేస్తుంది. వీటిలో దేని ప్రత్యేకత దానిదే! ఏ పని చేసినా మీ పట్ల, మీ అభిరుచి పట్ల నిజాయతీగా ఉండాలి. పరిశ్రమ సవాలుగా ఉండవచ్చు, కానీ పట్టుదల, అంకితభావం కీలకం. ఆర్టిస్టుగా నేర్చుకుంటూ ఎదగాలి. రిస్క్ తీసుకోవడానికి భయపడొద్దు. కలల్ని వదులుకోకుండా నమ్మకంతో ప్రయత్నిస్తే తప్పకుండా అనుకున్నది సాధిస్తారు.

# చిరంజీవి ఎవరినీ తొక్కరు

## .. ట్రోలర్స్‌కు బండ్ల గణేష్ స్ట్రాంగ్ కౌంటర్!



మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలు హైదరాబాద్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో నిర్మాత, నటుడు బండ్ల గణేష్ పాల్గొని తనదైన శైలిలో చేసిన భావోద్వేగ ప్రసంగం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చిరంజీవి వ్యక్తిత్వం, సేవా గుణం, కెరీర్ గురించి ప్రశంసలు కురిపించిన బండ్ల గణేష్.. ఇటీవల మెగాస్టార్‌ను సోషల్ మీడియాలో విమర్శిస్తున్న వారికి కూడా గట్టిగానే కౌంటర్ ఇచ్చారు. చిరంజీవి జన్మదినం సందర్భంగా బండ్ల గణేష్ మాట్లాడుతూ.. కొణిదెల వెంకట్రావు, అంజనాదేవి దంపతులకు జన్మించిన శివశంకర వరప్రసాద్.. నేడు ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజలు గర్వపడే మెగాస్టార్ చిరంజీవిగా ఎదిగారని కొనియాడారు. గత 71 ఏళ్లుగా ఆయన తన వెలుగుతో అభిమానులను ఆనందింపజేస్తూ, ఎందరికో జీవనోపాధి కల్పిస్తూ, తన చుట్టూ ఉన్న వారికి అండగా నిలుస్తున్నారని అన్నారు. చిరంజీవి క్యారెక్టర్, క్యాలిబర్, కెపాసిటీ, వ్యక్తిత్వం గురించి మాట్లాడేందుకు తనకు ఎలాంటి సందేహం లేదని.. తాను కేవలం నిజాలే మాట్లాడుతున్నానని బండ్ల గణేష్ భావోద్వేగంగా చెప్పారు. ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా ఒక కానిస్టేబుల్ కుమారుడిగా చెన్నై నగరానికి వచ్చిన చిరంజీవి.. తన కష్టంతో, ప్రతిభతో, పట్టుదలతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో స్థానం సంపాదించుకున్నారని బండ్ల గణేష్ అన్నారు."ఎవరు ఈ కుర్రాడు? ఎవరీ అడ్రస్ లేని వ్యక్తి?" అన్న స్థాయి నుంచి మెగాస్టార్ అంటే ఏమిటో చూపించిన గొప్ప వ్యక్తి చిరంజీవి అని కొనియాడారు. తనకు జీవితాన్ని ఇచ్చిన పవర్ స్టార్ పవన్ కళ్యాణ్‌ను కూడా తెలుగు చిత్ర పరిశ్రమకు తీసుకొచ్చిన వ్యక్తి చిరంజీవేనని చెప్పారు. అలాగే, ఒక మెగాస్టార్‌కు రామ్ చరణ్ రూపంలో మరో స్టార్ వారసత్వాన్ని కొనసాగించడం అరుదైన అదృష్టమని బండ్ల గణేష్ పేర్కొన్నారు. ఇటీవల చిరంజీవిపై సోషల్ మీడియాలో వస్తున్న ట్రోల్స్‌ను ఉద్దేశిస్తూ బండ్ల గణేష్ తనదైన స్టైల్‌లో స్పందించారు. చిరంజీవి వెనకాల ఎంతమంది ఉన్నా, కొందరు దూరమైనా.. ఆయన సాధించిన చరిత్ర మాత్రం ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోతుందని అన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి కుటుంబంపై చూపించే ప్రేమకు సంబంధించిన ఓ వ్యక్తిగత సంఘటనను కూడా ఆయన పంచుకున్నారు. ఇటీవల చిరంజీవి ఇంటికి వెళ్లినప్పుడు, ఆయన తన చెల్లికి నడుము నొప్పి ఉండటంతో మందు రాస్తున్నానని చెప్పారని బండ్ల గణేష్ వెల్లడించారు. కుటుంబ సభ్యుల పట్ల చిరంజీవి చూపించే ప్రేమకు ఇదే నిదర్శనమని అన్నారు. 85 ఏళ్ల తల్లిని ఎంతో ప్రేమగా చూసుకుంటూ, ఆమెను కంటికి రెప్పలా కాపాడుకునే వ్యక్తిత్వం చిరంజీవిదని.. తన కుటుంబ సభ్యులను మాత్రమే కాకుండా, తనవారిగా భావించే ప్రతి ఒక్కరినీ ఆదుకునే మనస్తత్వం ఆయనదని కొనియాడారు. 25 ఏళ్ల క్రితం తనకు ఎలాంటి గుర్తింపు లేని రోజుల్లో చిరంజీవి తనపై చూపించిన అభిమానాన్ని కూడా బండ్ల గణేష్ గుర్తు చేసుకున్నారు. తాను కొత్తగా ఇల్లు కట్టుకున్నానని చెప్పినప్పుడు, బిజీ షెడ్యూల్‌లో ఉన్నప్పటికీ చిరంజీవి తనను వెతుక్కుంటూ షాద్‌నగర్ వరకు వచ్చారని తెలిపారు. నడుము నొప్పి ఉన్నప్పటికీ దాదాపు 50 కిలోమీటర్లు ప్రయాణించి తన ఇంటికి వచ్చిన చిరంజీవి గొప్ప వ్యక్తిత్వాన్ని ఎప్పటికీ మర్చిపోలేనని చెప్పారు. చిరంజీవి క్యారెక్టర్, నిజాయితీ, స్టామినా గురించి ఎంత చెప్పినా తక్కువేనని అన్నారు. ఇక చిరంజీవిపై వచ్చే విమర్శలకు బండ్ల గణేష్ కౌంటర్ ఇచ్చారు. చిరంజీవి ఇతరులను తొక్కి ఎదిగారంటూ కొందరు చేసే వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. "చిరంజీవి ఎవరినీ తొక్కరు.. ఆయన ఎక్కుతారు, ఎక్కిస్తారు. లేపుతారు.. లేపి కూర్చోబెడతారు" అంటూ బండ్ల గణేష్ ఉద్వేగంగా అన్నారు. ఎవరికైనా టాలెంట్, నిజాయితీ ఉంటే వారిని ప్రోత్సహించి ఉన్నత స్థానానికి తీసుకెళ్లే వ్యక్తిత్వం చిరంజీవిదని పేర్కొన్నారు. చిరంజీవి ఇండస్ట్రీకి రాకపోయి ఉంటే నాలాంటి ఎంతోమందికి ధైర్యం, స్ఫూర్తి లభించేది కాదని చెప్పారు. మెగాస్టార్ చిరంజీవి ఇలాంటి పుట్టినరోజులు ఇంకా ఎన్నో జరుపుకోవాలని, భవిష్యత్తులోనూ మరిన్ని ఘన విజయాలు సాధించాలని బండ్ల గణేష్ ఆకాంక్షించారు.

# పండంటి మగబిడ్డకి జన్మనిచ్చిన 'కేరింత' బ్యూటీ ..

## అమ్మగా కొత్త ప్రయాణం మొదలు..

చాషిత్రీవం । టాలీవుడ్ ప్రేక్షకులకు 'కేరింత' సినిమాతో ఎంతో దగ్గరైన నటి సుకృతి అంబటి అభిమానులకు శుభవార్త చెప్పారు. పండంటి మగబిడ్డకు జన్మనిచ్చినట్లు ఆమె సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. ఈ సందర్భంగా సుకృతి పంచుకున్న ఆనందకరమైన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అభిమానులతో పాటు పలువురు సినీ ప్రముఖులు కూడా ఈ కొత్త తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. దిల్ రాజు నిర్మాణంలో వచ్చిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'కేరింత' సినిమాతో సుకృతి అంబటి తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. ఈ చిత్రంలో ఆమె పోషించిన 'భావన' పాత్ర ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. తన సహజమైన నటన, క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో యూత్‌లో మంచి గుర్తింపు సంపాదించుకున్నారు.డిజిటల్ డిక్షనరీలు మరియు ఎన్‌సైక్లోపీడియాలను శోధించడం సినిమా విజయం సాధించినప్పటికీ, ఆ తర్వాత సుకృతి సినిమాలకు కొంత దూరంగా ఉంటూ వ్యక్తిగత జీవితానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. ఢిల్లీకి చెందిన సుకృతి అంబటి, చదువుకునే రోజుల నుంచే నటనతో పాటు డ్యాన్స్‌పై ప్రత్యేక ఆసక్తి పెంచుకున్నారు. అలా సినిమా రంగంలోకి అడుగుపెట్టి 'కేరింత'తో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇక వ్యక్తిగత జీవితం విషయానికి వస్తే.. 2022 డిసెంబర్‌లో అక్షయ్ సింగ్‌ను సుకృతి వివాహం చేసుకున్నారు. వివాహం తర్వాత ఈ జంట తమ వైవాహిక జీవితాన్ని ఆనందంగా గడుపుతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో తాము త్వరలో తల్లిదండ్రులు కాబోతున్నామని సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. అప్పట్లో బేబీ బంప్‌తో సుకృతి షేర్ చేసిన ఫొటోలు కూడా నెట్టింట బాగా వైరల్ అయ్యాయి.ఇప్పుడు పండంటి మగబిడ్డ జన్మించడంతో సుకృతి జీవితంలో మరో అందమైన అధ్యాయం ప్రారంభమైంది. చిన్నారి రాకతో తమ కుటుంబంలో కొత్త వెలుగులు నిండాయని ఈ జంట ఆనందం వ్యక్తం చేస్తోంది. సినిమాలకు దూరంగా ఉన్నప్పటికీ సోషల్ మీడియా ద్వారా అభిమానులతో నిరంతరం టచ్‌లో ఉంటున్న సుకృతి, ఇప్పుడు అమ్మగా తన కొత్త ప్రయాణాన్ని ఆస్వాదిస్తున్నారు. అమ్మగా కొత్త బాధ్యతలు చేపట్టిన సుకృతి అంబటికి అభిమానులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలుపుతున్నారు. 'కేరింత'తో అలరించిన సుకృతి ఇప్పుడు మాతృత్వ ఆనందంతో కెరీర్‌కు మించిన జీవితంలోని మరో అందమైన పాత్రలో అడుగుపెట్టారు అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.